క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి శాంతి కల్యాణం


స్వామివారి కల్యాణంలో కూర్చున్న దంపతులు

మధురపూడి: కోరుకొండలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ఐదో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మండపంలో శాంతి కల్యాణం చేశారు. 226 మంది దంపతులు పాల్గొని స్వామిని కృపకు పాత్రులయ్యారు. అర్చక స్వామి బాపిరాజు శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు అన్న సమారాధన

బిక్కవోలు: గ్రామంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లెవాసు తెలిపారు. షష్ఠి ఉత్సవం ముగింపులో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటల నుంచి భారీ ఎత్తున్న అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలని కోరారు.

187 మందికి వైద్య సేవలు


సింగవరంలోని శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: సింగవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు నిర్వహించారు. బుధవారం సింగవరంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 187 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. రోగులకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేశారు.అవరసమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్ఎం అరుణ, ఆశా వర్కర్లు దేవి, విజయ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యూబీఐ ఏటీఎం ప్రారంభం


బ్యాంక్ ఏటీఎంను ప్రారంభించిన ఆర్ఎం విశ్వేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర బ్యాంకింగ్ సేవలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఎ.విశ్వేశ్వరరావు తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరానికి సమీపంలో ఉన్న మునికూడలి, కాటవరం గ్రామాలలో కొత్తగా ఏటీఎం సదుపాయం కల్పించి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెషీన్ ద్వారా అన్ని సమయాలలో ప్రజలు నగదు తీ సుకొనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ రంగారావు, యూనియన్ మేనేజర్ బీవీఎస్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి

రంగంపేట: పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి చెందినట్టు హెచ్‌సీ కోన నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్న దొడ్డిగుంట గ్రామానికి చెందిన యాగా రాంబాబు (45) జీవితం మీద విరక్తితో మంగళవారం రాత్రి పొలంలో కూల్ డ్రింక్‌లో గడ్డి మందు కలుపుకుని సేవించాడు. అనంతరం ఇంటికి వచ్చి తన భార్య సుజాతకు విషయం చెప్పాడు. వెంటనే భార్య సుజాత బంధువుల సహకారంతో అతడిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మోటార్ సైకిల్ దొంగ అరెస్టు


పెదపూడి: మోటార్ సైకిల్ దొంగను అరెస్ట్ చేసి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని పెదపూడి ఎస్సై రామారావు తెలిపారు. ఆయన బుధవారం తెలిపిన వివరాల మేరకు.. తమకు అందిన సమాచారం మేరకు కరకుదురు గ్రామంలో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. ఈ తనిఖీలో కరకుదురు గ్రామానికి చెందిన వి.సునీచ్ అనే వ్యక్తి చోరీ చేసిన మోటార్ సైకిల్‌తో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆరుగురి అరెస్టు

సీతానగరం: పేకాట ఆడుతున్న కాటవరానికి చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. కాటవరం శివారున పేకాటాడుతుండగా ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,860 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

- డిసెంబర్ నెలంతా వేడుకలు
- ఇళ్లు, చర్చిలు విద్యుద్దీపాలతో అలంకరణ
- ఆర్‌సీఎం లూథరన్ చర్చిల్లో నవదిన ప్రార్థనలు


పశ్చిమగానుగూడెంలోని వందేళ్లు నిండిన సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి


లూథరన్ చర్చిలో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ


విద్యుద్దీపాలతో అలంకరించి వేడుకలకు సిద్ధం చేసిన చర్చి

మధురపూడి: క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా క్రిస్మస్ వేడుకలు గ్రామాల్లో ఘనంగా జరుపుకొంటున్నారు. క్రీస్తు రాకడగా భావించి భక్తితో ఈ పండగను నిర్వహించుకుంటారు. ఈ నెల 11వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ చర్చిల్లో వేడుకలు ముమ్మరంగా జరుగుతాయి. ఇప్పటికే క్రైస్తవులు ఇళ్లు, చర్చిలను శుభ్రం చేసి సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించి అన్ని సిద్ధం చేశారు. రాజానగరం నియోజకవర్గంలోని 3 మండలాల్లో సుమారు 650 చర్చిల్లో ఈ వేడుకలు జరుపుకొంటున్నారు. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో లూథరన్, ఆర్‌సీఎం మిషనరీలకు చెందిన చర్చిలతోపాటు, బైబిల్ మిషన్, పెంతుకోస్తు తదితర సంస్థలకు చెందిన చర్చిల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పార్థనలు చేస్తున్నారు.

కళకళలాడుతున్న చర్చిలు

క్రిస్మస్ సందర్భంగా చర్చిలన్నీ రంగు రంగుల విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. చర్చిల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద స్టార్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటిని అందంగా అలంకరించుకొని వేడుకలు నిర్వహించుకుంటున్నారు.క్రైస్తవులు క్రిస్మస్‌కు ముందు కొన్ని రోజుల నుంచి దీక్షలను పాటిస్తారు. ఉదయం, రాత్రి వేళల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రిస్మస్ రోజున మాత్రం ఉపవాసాలతో, రాత్రంతా జాగరణతో ప్రార్థనలు నిర్వహిస్తారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంటుంది.

ప్రేమను పంచాలి



క్రిస్మస్ పండగ ద్వారా సమాజానికి క్రైస్తవులు ప్రేమను పంచాలి. హంగు ఆర్భాటం కాకుండా ఆనందోత్సవాలతో వేడుకలు నిర్వహించుకుంటారు. భక్తి భావాన్ని తెలియజేస్తారు. అందరి ఆదరణను కోరతారు. ఏసుక్రీస్తు మానవులందరికోసం పుడతారని తెలియజేసేదే క్రిస్మస్ వేడుకలు.

– పిట్టా కృష్ణ, లూథరన్ సంఘం పెద్ద, బూరుగుపూడి

ధ్యాన సాధనతో జీవితం సుఖమయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాయ జగపతిరాజు

రంగంపేట: ఓషో రజనీష్ యోగి సూక్తులను ఆచరణలో పెట్టి ఆనందమయ జీవితం గడపడానికి ప్రతి ఒక్కరూ నిరంతర ఆధ్యాత్మిక సాధన చేయాలని ప్రకృతి వ్యాలీ అధినేత దాట్ల రాయ జగపతి రాజు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక ఓషో పిరమిడ్ ఆశ్రమంలో నిర్వాహకులు బత్తిన నారాయణమ్మ, వీర వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రజనీష్ యోగి జన్మదిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంచి పుస్తక పఠనం, సత్సంగం, ధ్యాన సాధన ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో దివ్యమైన జీవితాన్ని గడపడానికి కృషి చేయాలన్నారు. పత్రీజీ బోధించిన ధ్యాన సాధన రత్నాలను ఆచరణలో పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా వేణు విద్వాన్ నాదయోగి టి.గణేష్ వేణునాదంతో చేసిన ధ్యాన సాధన అందరినీ ఆకట్టుకుంది. సమావేశంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర పిరమిడ్ సొసైటీ ప్రచారక్, కాకినాడ జిల్లా సేవాదళ్ కన్వీనర్ నెక్కంటి అనిత, స్థానిక దుర్గమాంబ పిరమిడ్ వ్యవస్థాపకురాలు ఉండవల్లి భ్రమరాంబిక తదితరులు ప్రసంగించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రంగంపేట: మండలంలో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం అవుతాయని తహసీల్దార్ కోసు అనసూయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 12 నుంచి జనవరి 6వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులను ఆయా గ్రామాల సచివాలయాల్లో నిర్వహించనున్నట్టు చెప్పారు. 12న రంగంపేట 1, 2 సచివాలయాల్లోనూ, 13న చంద్రేడు, 16న వడిశలేరు సచివాలయం-1, 17న వడిశలేరు సచివాలయం-2, 18న జి.దొంతమూరు సచివాలయం-1, 19న జి.దొంతమూరు సచివాలయం-2, 20న సుభద్రంపేట, 21న వెంకటాపురం, 23న కోటపాడు, 24న పెద రాయవరం, 26న ముకుందవరం, 27న ఎస్టీ రాజాపురం, 28న దొడ్డిగుంట, 30న సింగంపల్లి, 31న నల్లమిల్లి సచివాలయాల్లో జరుగుతాయన్నారు. జనవరి 3న మర్రిపూడి, 4న వీరంపాలెం, 6న ఈలకొలను సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు సదస్సులు ప్రారంభమవుతాయని చెప్పారు. రైతులు భూ సమస్యలపై అర్జీలు అందించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీతానగరం: బొబ్బిల్లంక సచివాలయం-2లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంకకు సంబంధించిన రెవెన్యూ సదస్సును బొబ్బిల్లంక సచివాలయం-2లో నిర్వహిస్తున్నామన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే ఈ సదస్సులో తెలియజేయవచ్చన్నారు.

అనపర్తిలో నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పెదపూడి: అనపర్తి మండలంలో గురువారం నుంచి జనవరి 7వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నామని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం పెడపర్తి, 17న కుతుకులూరు, 19న పులగుర్త, 21న రామవరం, 26న పొలమూరు, 28న కొప్పవరం, జనవరి 2న మహేంద్రవాడ, 4న అనపర్తి, 7న దుప్పలపూడి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు, ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా గౌరీ శంకరుల రథోత్సవం

- స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


రథోత్సవంలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గౌరీశంకరుల రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయంలో భక్తులు స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని ప్రజలంతా సఖ, సంతోషాలతో ఉండేలా కాపాడాలని స్వామిని కోరారు. ఉత్సవాలు గౌరీశంకరుల ఆలయం, రామాలయం, దేవితల్లి కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు పర్యవేక్షణలో కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ బందోబస్తు నిర్వహించారు.

నన్నయ యూనివర్సిటీ వాలీబాల్ జట్టుకు శిక్షణ


వాలీబాల్ పురుషుల టోర్నమెంట్‌కు ఎంపికైన జట్టు

పెదపూడి: ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పురుషుల టోర్నమెంట్‌కు ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరుపున ఎంపికైన జట్టుకు జి.మామిడాడ డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 3 రోజులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి తెలిపారు. 12 మంది మెయిన్ ప్లేయర్స్, ఇద్దరు స్టాండ్‌బై ప్లేయర్స్‌కు శిక్షణ ఇస్తున్నామన్నారు. 15వ తేదీన కేరళ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పందలపాక విద్యార్థిని


క్రీడాకారిణి సుస్మితను అభినందిస్తున్న పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తిరాజు

బిక్కవోలు: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పందలపాక గ్రామంలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వైరాల సుస్మిత ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన అండర్-19 ఖోఖో పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరచడంతో ఈ నెల 13న తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా తరుపున ఆడుతుందన్నారు. విద్యార్థినిని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు అభినందించారు. కార్యక్రమంలో పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి, పాల్గొన్నారు.

అయ్యప్పకు రుద్రాభిషేకం


పందలపాకలో అయ్యప్ప స్వామికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని తుల్యాభాగ నదీ తీరాన వెలసియున్న అయ్యప్పస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. బుధవారం ఏకాదశిని పురస్కరించుకుని అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు (బుజ్జిపంతులు) 18 రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

14న నీటి సంఘాల ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిబాబు

రంగంపేట: సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూలు బుధవారం విడుదలైన నేపథ్యంలో ఈ నెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిబాబు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రంగంపేట, దొడ్డిగుంట గ్రామాలకు చెందిన సాగు నీటి సంఘాలకు 14న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రంగంపేట, దొడ్డిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు జరుగుతాయన్నారు. రంగంపేటలో జరిగే ఎన్నికకు తాను, దొడ్డిగుంటలో జరిగే ఎన్నికకు ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం ఎన్నికల అధికారులుగా వ్యవరిస్తామన్నారు. ఒక్కో కేంద్రం వద్ద ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల విధులు నిర్వహిస్తారని, వారికి వీఆర్వోలు సహకరిస్తారని తెలిపారు. ముందుగా సంఘానికి ఆరుగురు సభ్యులను ఎంపిక చేస్తారని, వారిలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోసు అనసూయ, ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ధర్నాను జయప్రదం చేద్దాం


అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి

పెదపూడి: రైతు సమస్యలపై ఈ నెల 13న రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు, రైతు సంఘాలు హాజరై జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు మేరకు రైతుల పక్షాన ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని దుయ్యబట్టారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, బండారు శ్రీను, పార్టీ నాయకులు కర్రి చిన్న వెంకటరెడ్డి, మండ వెంకటరెడ్డి, పడాల వెంకటరెడ్డి, కానూరి కృష్ణ, నందికోళ్ల రవికుమార్, మాదాబత్తుల శంకర్‌బాబు, ర్యాలీ కృష్ణ, మల్లిడి గోవిందరెడ్డి, చింతా రామారావు తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా భామిరెడ్డి


నియామకపు ఉత్తర్వులు అందుకుంటున్న భామిరెడ్డి

పెదపూడి: జి.మామిడాడ గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, సినీ నటుడు, స్టేట్ హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్‌గా ఏడాది పాటు పని చేసిన మేడపాటి భామిరెడ్డి నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ నెల 10న విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో హ్యూమన్ రైట్స్ డే జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారు తనను నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినట్లు భామిరెడ్డి తెలిపారు. తాను మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని, బాధ్యతగా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. భామిరెడ్డిని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ఉపాధి పథకం పనుల్లో అలసత్వం వద్దు

పెదపూడి: ఉపాధి హామీ పథకం పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఈ నెలలో చేపట్టిన పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొబ్బరిమొక్కలు ఏపుగా పెరగడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్లు, గోకులాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ, టీఏ మూర్తి, ఎఫ్ఏలు నారాయణ, సురేష్, సతీష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా 'యువ ఉత్సవ్'


పోటీలను తిలకిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు


సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని, సమాజహితంగా వినియోగిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'నన్నయ' వర్సిటీలో బుధవారం నిర్వహించిన 'యువ ఉత్సవ్' కార్యక్రమం యువతను ఉర్రూతలూగిస్తూ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ నేటి కాలంలో యువత సెల్ ఫోన్లతోనే ఎక్కువ సమయాన్ని గడిపేస్తున్నారన్నారు. అదే సమయాన్ని కమ్యూనికేషన్ స్కిల్స్‌ని డెవలప్ చేసుకునేందుకు వినియోగిస్తే ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారన్నారు. వారిలో ఆ స్ఫూర్తిని కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, దేశంపై వారిలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు కూడా ఇవి అవసరమన్నారు. స్వామి వివేకానందుని స్ఫూర్తితో యువత పయనం సమాజహితంగా సాగాలనే ఆకాంక్షను వెల్లబుచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ యువ ఉత్సవ్‌లో భాగంగా భారతదేశం 2047 నాటికి ప్రపంచ దేశాలకు ఒక దిక్సూచిలా తయారుకావాలన్నారు. అందుకు యువశక్తి తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ సైన్స్ మేళా ఎగ్జిబిషన్ గ్రూప్, సోలో, పెయింటింగ్, పద్యాలు రాయడం, ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాలకు పోటీలు నిర్వహించామన్నారు. యూనివర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థుల స్పందన బాగుందన్నారు. ఈ పోటీలలో విజేతలైన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారన్నారు.

భూములకు రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బంది

రాజానగరం: గత రెండు నెలలుగా వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరుగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు, దివాన్‌చెరువు సొసైటీ మాజీ చైర్‌పర్సన్ గంగిశెట్టి సోమేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కారణంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపేశారంటే సమాధానం చెప్పేవారు కూడా లేదరన్నారు. ప్రధాన కారణం లేకుండా రిజిస్ట్రేషన్లు ఆపివేయడం అనేక మంది ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం పెళ్లిళ్ల ముహూర్తాలు ఉండడంతో తమ పిల్లలకు సంబంధాలు కుదుర్చుకుని, వివాహాలు చేసే విషయమై ఈ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని వాపోయారు. భూముల రిజిస్ట్రేషన్లను ఆపివేయడం వలన కొన్ని సందర్భాలలో కుదిరిన సంబంధాలను కూడా వదులుకోవలసి వస్తుందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు కలుగజేసుకుని, సత్వరమే వ్యవసాయ భూములకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని గంగిశెట్టి విజ్ఞప్తి చేశారు.

అలరించిన నుదిటి రాత నాటకం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన నుదిటి రాత సాంఘిక నాటకం చూపరులను అలరించింది. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ నాటకాన్ని కందరాడ గ్రామానికి చెందిన బాల సరస్వతీ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అనంతరం కమిటీ సభ్యులు కళాకారులను సత్కరించారు.

14న ఉద్యోగుల వన భోజనాలు


సంపర పీహెచ్‌సీలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యురాలు శిరీష

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 14న వన భోజనాలు ఏర్పాటు చేశారని అంతా హాజరై జయప్రదం చేయాలని కార్యక్రమ ప్రతినిధులు విజయలక్ష్మి, భవానీ ప్రసాద్‌లు తెలిపారు. సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు శిరీష వన భోజనాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ పంచాయతీ రాజ్, ప్రజారోగ్య, వైద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఆడిట్, ట్రెజరీ, రెవెన్యూ, ఉపాధ్యాయ తదితర ఉద్యోగ సంఘాల ఉద్యోగులు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

విధి నిర్వహణలో అంకితభావం అవసరం

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో సీఐటీయూ నాయకుడు వాసంశెట్టి సూర్యనారాయణ బుధవారం ఐఎల్‌టీడీ కంపెనీలో పనిచేసి పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సన్మాన గ్రహీత సూర్యనారాయణ ఆయన సతీమణి మల్లీశ్వరి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, మస్తానమ్మ దంపతులు, డయాబెటీస్ వైద్యులు రామగురెడ్డి, సీడీఆర్ ఆస్పత్రి వైద్యులు కర్రి సునీల్ కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

చోరీపై కేసు నమోదు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఊలపల్లి గ్రామంలోని బజార్ వీధిలో నివాసం ఉంటున్న ముక్కముల సూరమ్మ గ్రామస్తులతో కలిసి అక్టోబర్ 15న కాశీ వెళ్లారు. తిరిగి డిశంబర్ 11వ తేదీన ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తీసి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపు తెరచి ఉండటాన్ని గమనించారు. బీరువాలో ఉన్న బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.